విజయానికి ఇవే ప్రధానం!

జేఈఈ మెయిన్ - 2024 మొదటి సెషన్‌ను జనవరి 24వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీల మధ్య నిర్వహించనున్నారు. జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారి సౌలభ్యం కోసం విద్యా సంవత్సరం మొదటిలోనే ప్రవేశ పరీక్షల సిలబస్‌ను ప్రకటిస్తుంటారు. కానీ పరీక్షకు కేవలం రెండు నెలల ముందే జేఈఈ-మెయిన్ 2024 సిలబస్‌ను వెల్లడించారు. అయితే సిలబస్‌ను కొంతమేరకు తగ్గించడం విద్యార్థులకు ఊరటనిచ్చే అంశం. ఈ సందర్భంగా జేఈఈ మెయిన్‌లో ఆశించిన ర్యాంకు తెచ్చుకోవాలంటే ఎలాంటి కృషి చేయాలి? తెలుసుకుందాం!



సిలబస్‌కు అనుగుణంగానే ప్రశ్నపత్రాలు రూపొందించి నిర్వహిస్తే ఫలితం ఉంటుంది. లేకపోతే మారిన కొత్త సిలబస్ వల్ల ప్రయోజనం ఉండదు. ఎందుకంటే..జేఈఈ మెయిన్‌ను ఈ సంవత్సరం రెండు సెషన్స్‌లో సెషన్‌కు 5 రోజులు, రోజుకు 2 షిఫ్టుల్లో నిర్వహిస్తారు. అంటే ఈ పరీక్షకు సుమారు 20కి పైన విభిన్న ప్రశ్నపత్రాలు అందజేస్తూ.. మారిన సిలబస్‌కు అనుగుణంగా నిర్వహించడం.. కత్తి మీద సాము లాంటిదే!

మ్యాథ్స్, ఫిజిక్స్‌లతో పోల్చుకుంటే కెమిస్ట్రీ నుంచి కాస్త ఎక్కువగానే అధ్యాయాలను తొలగించారు. ఇది విద్యార్థులకు చాలా ఉపశమనమే. ఇదే మాదిరిగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కూడా కెమిస్ట్రీలో సిలబస్ తగ్గిస్తే చాలా భారం తగ్గుతుంది. ఇంతవరకు జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 సిలబస్ గురించి ఎటువంటి విషయం తెలియకపోవడంతో కాస్త అయోమయ స్థితి ఏర్పడింది. గత సంవత్సరం వరకూ జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్ సిలబస్‌లు రెండూ ఒకటే కావడంతో విద్యార్థులు ఎలాంటి గందరగోళం లేకుండా ప్రిపేర్ అయ్యారు. దీనిపై కూడా త్వరలోనే స్పష్టత వస్తుందని భావిద్దాం.

'పూర్తి ప్రయత్నమే సంపూర్ణ విజయం' అని మహాత్మాగాంధీ చెప్పినట్టు జాతీయ స్థాయి పరీక్షల్లో మినహాయింపుల్లేకుండా సన్నద్ధం కావాలి. జేఈఈ సిలబస్‌లో జరిగిన మార్పులకు తగ్గట్టుగా చదివే పంథాను మార్చుకోవాలి. నిర్మాణాత్మక ప్రణాళిక, సమర్థ వ్యూహాలతో జేఈఈ-మెయిన్‌లో విజయావకాశాలను పెంచుకోవచ్చు.

పరీక్ష సరళిని అర్థం చేసుకోండి

జేఈఈ-మెయిన్ 2023 మాదిరిగానే జేఈఈ మెయిన్-2024ను నిర్వహిస్తున్నారు. ప్రశ్నల సంఖ్య, వాటి మార్కులు, రుణాత్మక మార్కులు, ఛాయిస్ వంటివన్నీ జేఈఈ-మెయిన్-2023 మాదిరిగానే ఉంటాయి. అంటే.. ప్రతి సబ్జెక్టులోని రెండో సెక్షన్‌లో వచ్చే న్యూమరికల్/ఇంటిజర్ టైప్ తరహా ప్రశ్నలకు మాత్రమే ఛాయిస్ ఉంది. మొదటి సెక్షన్‌లోని స్ట్రెయిట్ ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు ఛాయిస్ లేదు.

స్టడీ మెటీరియల్

2019 నుంచి 2023 వరకు 95 శాతం ప్రశ్నలు కెమిస్ట్రీలో ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే ఇస్తున్నారు. అలాగే ఫిజిక్స్‌లో కూడా సుమారు 75 శాతం ప్రశ్నలు యథాతథంగా ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే ఇస్తున్నారు. మ్యాథ్స్ అయినా ఫిజిక్స్, కెమిస్ట్రీ అయినా ఎన్‌సీఈఆర్‌టీలోని అంశాలపైనే ఉంటాయి. కానీ ఎక్కువ సమస్యల సాధన నిమిత్తం మీరు తీసుకునే కోచింగ్ సంస్థల స్టడీ మెటీరియల్‌నే అనుసరించవచ్చు.

పట్టులేనివాటికి ప్రాధాన్యం

ఇది విద్యార్థులను బట్టి మారుతుంది. ముఖ్యంగా అందరూ స్టేట్‌మెంట్-1, స్టేట్‌మెంట్-2 లేదా అసర్షన్స్ అండ్ రీజన్స్ తరహా ప్రశ్నల్లో తప్పు చేస్తున్నారు. అంతే కాదు, ప్రతి సబ్జెక్టులో కొన్ని ముఖ్యమైన స్టాండర్డ్ ఫార్ములాలుంటాయి. వాటిని గుర్తుపెట్టుకోవడం ఎంతైనా అవసరం. పరీక్ష హాల్లో వాటిని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తే సమయం వృథా అవుతుంది. మీ బలమైన అంశాలపై అంటే మీకు బాగా పట్టున్న అంశాలపై ప్రశ్నలు వస్తే తప్పు చేయవద్దు.

రెగ్యులర్ ప్రాక్టీస్, పాత ప్రశ్నపత్రాలు

ప్రశ్నపత్రాల విశ్లేషణను బట్టి- ప్రతి సబ్జెక్టులో 40 శాతం ప్రశ్నలు డైరెక్టుగా ఫార్ములా బేస్డ్, 40 శాతం ప్రశ్నలు పాత ప్రశ్నపత్రాల నుంచి, 10 శాతం ప్రశ్నలు పాత జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోని స్ట్రెయిట్ ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, 5 శాతం ప్రశ్నలు కాస్త ఎక్కువ సమయం పట్టేవి, మిగిలిన 5 శాతం ప్రశ్నలు కాస్త కొత్త పదాలను ఉపయోగించి అడిగే ప్రశ్నలు ఉన్నాయి. కాబట్టి క్రమం తప్పకుండా పాత ప్రశ్నపత్రాలన్నీ సాధన చేయడం ఎంతైనా మంచిది.

మాక్ టెస్ట్‌లు

ఇవి ఎన్ని రాస్తే అంత మంచిది. దీనివల్ల టైమ్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన పెరుగుతుంది. మీరు తరచూ చేసే తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్త పడటానికి దోహదం చేస్తాయి. ఇప్పటినుంచీ కనీసం రెండు రోజులకు ఒక మాక్ టెస్ట్ సాధన చేయడం మేలు. విద్యార్థుల సౌలభ్యం కోసం ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో ఈ మాక్ టెస్టులను అందుబాటులో ఉంచారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి.

ఆరోగ్య సంరక్షణ

అన్నిటికన్నా ఇది చాలా ముఖ్యం. సమయానికి సరైన పోషకాహారం తీసుకోవడంతోపాటు తగినంత వ్యాయామం, నిద్ర మిమ్మల్ని చాలా చురుగ్గా ఆలోచించేలా చేస్తాయి. వీటిని ఎటువంటి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయొద్దు.

సలహాలు - సందేహ నివృత్తి

ఏ సబ్జెక్టు ప్రిపేర్ అయినా అందులోని అంశాలను పద్ధతి ప్రకారం సన్నద్ధం కావాలి. పూర్తి అవగాహన రాకపోతే అధ్యాపకుల సలహాలతో సందేహ నివృత్తి చేసుకోండి. మీ సన్నద్ధత అంతటా సానుకూల దృక్పథాన్ని కొనసాగించండి. ప్రేరణ కోల్పోకుండా మీ శక్తి సామర్థ్యాలను పూర్తిగా వినియోగించుకోండి.

గమనించండి!

- మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో జేఈఈ మెయిన్-2024 కోసం ప్రత్యేకంగా తొలగించిన అంశాలన్నీ ఏపీ, టీఎస్ ఇంటర్మీడియట్ సిలబస్‌లో ఉన్నాయి.
- అందులోనూ తొలగించిన ఆ భాగాల నుంచి ప్రశ్నలు కూడా ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల్లో తప్పకుండా వస్తాయి. అందువల్ల జేఈఈ-మెయిన్ కోసం మాత్రమే సన్నద్ధమయ్యే విద్యార్థులు, తొలగించిన ఆయా అంశాలను బోర్డు పరీక్షల స్థాయిలో సన్నద్ధం కావడం మంచిది.
- జేఈఈ-అడ్వాన్స్‌డ్‌కు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు కూడా జేఈఈ-మెయిన్‌లో తొలగించిన అంశాలపై పట్టు సాధించాలి. మరీ ముఖ్యంగా మ్యాథ్స్, ఫిజిక్స్‌లలో జేఈఈ-మెయిన్‌లో తొలగించిన అంశాల ప్రభావం జేఈఈ-అడ్వాన్స్‌డ్‌లో ఎంతమాత్రం చూపించదు.
- జేఈఈ-అడ్వాన్స్‌డ్-2024 సిలబస్ కూడా ప్రకటించిన తర్వాత మనకు పూర్తిగా అర్థమవుతుంది. అంతవరకు జేఈఈ-అడ్వాన్స్‌డ్ ప్రిపేర్ అయ్యే విద్యార్థులు జేఈఈ-అడ్వాన్స్‌డ్-2023ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి.

జేఈఈ మెయిన్ 2023 ఆలిండియా ర్యాంక్స్ Vs పర్సంటైల్ స్కోర్స్

జేఈఈ మెయిన్ 2023లో రెండు సెషన్లు నిర్వహించిన అనంతరం వాటిని క్రోడీకరించి ప్రకటించిన ఆల్ ఇండియా ర్యాంకులూ, సాధించినవారి పర్సంటైల్స్ కింది పట్టికలో ఉన్నాయి. సుమారుగా ఇదేవిధంగా జేఈఈ మెయిన్-2024 చివరి ఫలితాలు ఉండొచ్చు. ప్రాథమికంగా ఒక అంచనా కోసం ఈ పట్టికను ఉపయోగించుకోవచ్చు.

ఆల్‌ఇండియా ర్యాంక్స్	పర్సంటైల్ స్కోర్స్ (సెషన్ 1, 2 ఆధారంగా)
1) 1 నుంచి 20 లోపు	100
2) 100 లోపు	99.995..... పైన
3) 1000 లోపు	99.92 ..... పైన
4) 5000 లోపు	99.57 ..... పైన
5) 10000 లోపు	99.14 ..... పైన
6) 20000 లోపు	98.28 ..... పైన

పరీక్ష రోజు

పరీక్ష రోజున మీరు ఎంత ప్రశాంతంగా ఉంటారో అంత బాగా రాస్తారు. ఎంత చదివారన్నది కాదు.. ఎంత బాగా రాశారన్నదే ముఖ్యం. మీ ప్రిపరేషన్‌లో నిజాయతీ ఉంటే 90 శాతం ప్రశ్నలు మీరనుకున్నవే ప్రతి పేపర్లో ఉంటారయని నమ్మండి. ఎటువంటి పరిస్థితిలోనూ తెలిసిన ప్రశ్నను తప్పు చేయొద్దు.

జేఈఈ మెయిన్ ప్రిపరేషన్, ఇతర పరీక్షల అధ్యయనాల మధ్య సమతుల్యతను పాటించండి. నిలకడ కలిగిన స్మార్ట్ ప్రిపరేషన్ ముఖ్యమని గుర్తించండి. ఇవన్నీ పాటిస్తే ఇక అంతిమ విజయం మీదే.

– ఎం.ఉమాశంకర్
శ్రీచైతన్య ఐఐటీ జాతీయ సమన్వయకర్త

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

ఒడిశా బయోడైవర్సిటీ బోర్డులో ..

ఒడిశా భువనేశ్వర్‌లోని ఒడిశా బయోడైవర్సిటీ బోర్డు.. తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. సీనియర్ ప్రాజెక్ట్ ఫెలో 2. జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో
మొత్తం ఖాళీలు: 25
అర్హత: ఎంఎస్సీ (జువాలజీ, వైల్డ్‌లైఫ్, బయోటెక్నాలజీ, బయోడైవర్సిటీ, అగ్రికల్చర్, బోటనీ, మైక్రోబయాలజీ)తో పాటు పరిశోధనానుభవం.
నెలకు జూనియర్ ప్రాజెక్ట్ ఫెలోకు రూ.20,00; సీనియర్ ప్రాజెక్ట్ ఫెలోకు రూ.23,000 చెల్లిస్తారు.
ఎంపిక: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 03-12-2023.
వెబ్‌సైట్: https://www.odishabiodiversityboard.in/

మహాత్మాగాంధీ వర్సిటీలో టీచింగ్ ఖాళీలు

బిహార్ రాష్ట్రం మోతిహరిలోని మహాత్మాగాంధీ సెంట్రల్ యూనివర్సిటీ (ఎంజీసీయూ), సోషల్ సైన్సెస్ విభాగం... కింది టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. ప్రొఫెసర్ 2. అసిస్టెంట్ ప్రొఫెసర్ 3. అసోసియేట్ ప్రొఫెసర్
మొత్తం ఖాళీలు: 13.
విభాగాలు: ఎకనామిక్స్, గాంధీయన్ అండ్ పీస్ స్టడీస్, సోషల్ వర్క్, సోషియాలజీ, పొలిటికల్ సైన్సు.
అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ, నెట్/ స్లెట్/ సెట్‌తో పాటు బోధన/ పరిశోధనానుభవం. **వేతన శ్రేణి:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,44,200 - 2,18,200. అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400 – 2,17,100. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.57,700 – 1,82,400.
దరఖాస్తు ఫీజు: రూ.2,000. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 02-12-2023.
వెబ్‌సైట్: https://mgcub.ac.in/

తమిళనాడు నేషనల్ లా వర్సిటీలో ..

తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లిలోని తమిళనాడు నేషనల్ లా యూనివర్సిటీ (టీఎన్ఎన్ఎల్‌యూ)... కింది టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. ప్రొఫెసర్ 2. అసోసియేట్ ప్రొఫెసర్
3. అసిస్టెంట్ ప్రొఫెసర్
విభాగాలు: లా, నాన్-లా.
అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీ.
మూల వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,44,200, అసోసియేట్ ప్రొఫెసర్ రూ.1,31,400, అసిస్టెంట్ ప్రొఫెసర్ రూ. 57,700.
దరఖాస్తు ఫీజు: రూ.1500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.750 చెల్లించాలి.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను తమిళనాడు నేషనల్ లా యూనివర్సిటీ, తిరుచిరాపల్లి, తమిళనాడు రాష్ట్రం చిరునామాకు పంపాలి.
ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 18-12-2023.
వెబ్‌సైట్: https://www.tnnlu.ac.in/

వాక్-ఇన్

తితిదేలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)- ఒప్పంద ప్రాతిపదికన తితిదే ఆసుపత్రుల్లో 8 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణత. ఎండీ/ ఎంఎస్‌కు ప్రాధాన్యం ఉంటుంది. నెలకు రూ.53,495 చెల్లిస్తారు.
ఇంటర్వ్యూ తేదీ: 29-11-2023. **వేదిక:** ఎస్‌వీఈబీఏ బిల్డింగ్, తిరుపతి.
వెబ్‌సైట్: https://www.tirumala.org/

చదువు
కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.
మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

హ్యాపీమైండ్

1. సైకాలజీ (మార్కెటింగ్)
స్టైపెండ్: నెలకు రూ.1,000-3,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 1, 2023
అర్హతలు: సైకాలజీ (మార్కెటింగ్) నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
internshala.com/i/d92531

2.ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: నెలకు రూ.1,000-2,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 1, 2023
internshala.com/i/0dc7ea

ఫిజిక్స్ కంటెంట్ రైటింగ్

సంస్థ: హాజ్‌టెన్ **స్టైపెండ్:** నెలకు రూ.5,000-15,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 1, 2023
అర్హతలు: క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ రాయడం, ఫిజిక్స్, సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్, టీచింగ్ నైపుణ్యాలు internshala.com/i/e143f2

ఆర్కిటెక్చర్

సంస్థ: డిజిప్లస్ **స్టైపెండ్:** నెలకు రూ.25,000-30,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 1, 2023
అర్హతలు: 3డిఎస్ మ్యాక్స్, అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఆటోక్యాడ్, ఆటోడెస్క్ రెవిట్, ఎంఎస్-ఆఫీస్ నైపుణ్యాలు internshala.com/i/d8e45a

డిజిటల్ మార్కెటింగ్ (మెమె అండ్ కరౌసెల్ మేకింగ్)

సంస్థ: లాటెక్ **స్టైపెండ్:** నెలకు రూ.6,000-8,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 1, 2023 **అర్హతలు:** ఇంగ్లిష్ రాయడం, డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎస్ఈఎం, ఎస్ఈఓ, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు internshala.com/i/ab1a61

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: ఆంత్రోఫిట్ లైఫ్ సైన్సెస్ కో **స్టైపెండ్:** నెలకు రూ.4,000-6,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 1, 2023
అర్హతలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, కోరల్‌డ్రా నైపుణ్యాలు internshala.com/i/36dd0b

జనరల్ మేనేజ్‌మెంట్

సంస్థ: అడోర్ ఎర్త్ **స్టైపెండ్:** నెలకు రూ.4,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 1, 2023
అర్హతలు: ఇంగ్లిష్ రాయడంలో నైపుణ్యం internshala.com/i/5d52e9

యూఐ/యూఎక్స్ డిజైన్

సంస్థ: రాధికా కపూర్ **స్టైపెండ్:** నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 1, 2023 **అర్హతలు:** అడోబ్ ఇలస్ట్రేటర్, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, యూజర్ ఇంటర్‌ఫేస్ డెవలప్‌మెంట్, వెబ్‌ఫ్లో, వైర్‌ఫ్రేమింగ్ నైపుణ్యాలు internshala.com/i/69dea7

టాలెంట్ అక్విజిషన్

సంస్థ: టాప్‌హైర్ **స్టైపెండ్:** నెలకు రూ.5,000-15,000 **దరఖాస్తు గడువు:** డిసెంబరు 1, 2023 **అర్హతలు:** ఇంగ్లిష్ మాట్లాడటంలో నైపుణ్యం
internshala.com/i/611852

విదేశాల్లో జర్నలిజం కోర్సు

జర్నలిజంలో మాస్టర్స్ డిగ్రీకి సంబంధించి విదేశాల్లోని ఉత్తమ కళాశాలల వివరాలు చెప్పండి. ఈ కోర్సుతో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి?
- మనోహర్‌బాబు



జర్నలిజం కోర్సు విదేశాల్లో చాలా యూనివర్సిటీల్లో ఉంది. వీటిలో యూనివర్సిటీ ఆఫ్ ఆమ్‌స్టర్‌డామ్, యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా, ది లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్- ఆస్టిన్, నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ - మాడిసన్, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ, న్యూయార్క్ యూనివర్సిటీ ముఖ్యమైనవి. ఇవే కాకుండా- ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, హాంకాంగ్‌లో కూడా ప్రముఖ విశ్వవిద్యాలయాలు జర్నలిజం కోర్సును అందిస్తున్నాయి. ఉద్యోగావకాశాల విషయానికొస్తే జర్నలిజం చదివినవారు జర్నలిస్ట్, కంటెంట్ క్రియేటర్, రేడియో జాకీ, పబ్లిక్ రిలేషన్స్ ప్రొఫెషనల్, కాలమిస్ట్, ఎడిటర్, క్రిటిక్, కాపీ రైటర్, ఫిల్మ్ మేకర్..ఇలాంటి హోదాల్లో ఉద్యోగాల్లోకి ప్రవేశించవచ్చు. ఇవే కాకుండా బోధన, అడ్వర్‌టైజింగ్, బ్రాడ్ కాస్టింగ్ అండ్ ప్రొడక్షన్ రంగాల్లోనూ వివిధ రకాలైన ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఎన్‌ఐటీ పట్నాలో నాన్ టీచింగ్ పోస్టులు

పట్నాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) రెగ్యులర్ ప్రాతిపదికన 47 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. స్క్రీనింగ్, రాత/ స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పోస్టులను అనుసరించి విద్యార్హతలు, గరిష్ఠ వయసులో తేడాలు ఉంటాయి. అనుభవం ఉన్న అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యమిస్తారు. విద్యార్హతలు, అనుభవం ఆధారంగా స్క్రీనింగ్ నిర్వహించి అభ్యర్థుల షార్ట్ లిస్ట్‌ను తయారుచేస్తారు. ఎంపికలో భాగంగా స్క్రీనింగ్, ట్రేడ్/ స్కిల్ టెస్ట్, మల్టిపుల్ ఛాయిస్ క్వశ్చన్స్ (ఎంసీక్యూ) అండ్ డిస్క్రిప్టివ్/ షార్ట్ ఆన్సర్ టెస్ట్‌లు ఉంటాయి. వీటి వివరాలను వెబ్‌సైట్‌లో ప్రచురిస్తారు.

సూపరింటెండెంట్: 05 ఖాళీలు. ఏదైనా డిగ్రీ మొదటి తరగతిలో పాసవ్వాలి. లేదా పీజీ రెండో తరగతిలో పాసవ్వాలి. ట్యాలీ అండ్ అకౌంటింగ్ నాలెడ్జ్, కంప్యూటర్, స్టెనోగ్రఫీ స్కిల్స్ ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. గరిష్ఠ వయసు 30 సంవత్సరాలు.

టెక్నికల్ అసిస్టెంట్: సివిల్, ఎలక్ట్రికల్, కెమికల్ టెక్నాలజీ, సర్వర్ అండ్ నెట్‌వర్క్, ఎంఐఎస్, హార్డ్‌వేర్, మెకట్రానిక్స్, మెకానికల్ విభాగాల్లో 11 ఖాళీలు ఉన్నాయి. అభ్యర్థులు సంబంధిత విభాగాల్లో బీఈ/బీటెక్/ ఇంజినీరింగ్ డిప్లొమా ఫస్ట్‌క్లాస్‌లో పాసవ్వాలి. పరిశ్రమలో పనిచేసిన అనుభవం ఉండాలి. గరిష్ఠ వయసు 30 సంవత్సరాలు.

టెక్నీషియన్: వెబ్‌సైట్, ఎంఐఎస్, హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, మెకట్రానిక్స్, కెమికల్ టెక్నాలజీ, మెటీరియల్ ఇంజినీరింగ్, ఈఎస్‌యూ, ఈఎంయూ, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, సీఎస్ఈ, ఈసీఈ, సివిల్ విభాగాల్లో 18 ఖాళీలు ఉన్నాయి. సైన్స్ సబ్జెక్టుతో ఇంటర్మీడియట్ 60 శాతం మార్కులతో పాసవ్వాలి/ 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్, ఏడాది వ్యవధి ఉండే ఐటీఐ పాసవ్వాలి/ పదో తరగతి 60 శాతం మార్కులతో పాసై, రెండేళ్ల ఐటీఐ సర్టిఫికెట్ ఉండాలి/ మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమా పాసవ్వాలి. వెబ్‌ప్రోగ్రామింగ్ నాలెడ్జ్, పీసీ/ సర్వర్, డేటా మెయింటెనెన్స్ చేసేవారికి ప్రాధాన్యమిస్తారు. గరిష్ఠ వయసు 27 సంవత్సరాలు.

జూనియర్ అసిస్టెంట్ (అకౌంట్స్): 6 ఖాళీలు. ఇంటర్మీడియట్ పాసై, ఇంగ్లిష్ టైపింగ్ స్పీడ్ నిమిషానికి 35 పదాలు ఉండాలి. కంప్యూటర్ వర్డ్ ప్రాసెసింగ్, స్ప్రెడ్‌షీట్ నైపుణ్యం ఉండాలి. ట్యాలీ, అకౌంటింగ్, స్టెనోగ్రఫీ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. గరిష్ఠ వయసు 27 సంవత్సరాలు.

ఆఫీస్ అటెండెంట్: 7 ఖాళీలు. ఇంటర్మీడియట్ పాసవ్వాలి. కమ్యూనికేషన్ స్కిల్, రికార్డ్ కీపింగ్ పరిజ్ఞానం ఉండాలి. గరిష్ఠ వయసు 27 సంవత్సరాలు.

యూఆర్/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ (ఎన్‌సీఎల్) అభ్యర్థులకు దరఖాస్తు రుసుము రూ.400. ఎస్సీ/ఎస్టీలకు రూ.200. దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు. గరిష్ఠ వయసులో ఎస్సీ/ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 10-15 ఏళ్ల సడలింపు ఉంటుంది. డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు చివరి తేదీ: 28.11.2023
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 29.11.2023
సపోర్టింగ్ డాక్యుమెంట్లతో దరఖాస్తు ప్రింటవుట్ సమర్పించడానికి చివరి తేదీ: 07.12.2023
వెబ్‌సైట్: www.nitp.ac.in

గమనించాల్సినవి

- ఒకటికంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు వాటిని వేర్వేరుగా పంపాలి. ప్రతి పోస్టుకూ ప్రత్యేకంగా ఫీజు చెల్లించాలి. ఒకటికంటే ఎక్కువ ఈ-మెయిల్ ఐడీలను దరఖాస్తులో రాయాలి.
- దరఖాస్తుకు విద్యార్హతలు, ఉద్యోగ అనుభవానికి సంబంధించిన సర్టిఫికెట్లను జతచేసి 'రిజిస్ట్రార్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పట్నా, అశోక్ రాజ్‌పథ్, పట్నా-800 005' చిరునామాకు స్పీడ్/ రిజిస్టర్డ్ పోస్టులో పంపించాలి. కవరు మీద దరఖాస్తు చేస్తున్న ఉద్యోగం పేరును స్పష్టంగా రాయాలి.
- అభ్యర్థుల ఎంపిక విధానానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెబ్‌సైట్‌లో ఉంచుతారు.